

కోదండరాముడి సేవలో జడ్జి శ్రీదేవి

ప్రజాశక్తి-ఒంటిమిట్ట

శ్రీకోదండ రామ స్వామిని అనంత పురం జిల్లా ఇండస్ట్రియల్ ట్రిబ్యునల్ జడ్జి జి.శ్రీదేవి, ఆమె భర్త రామారావు బుధవారం దర్శం చుకున్నారు. కుటుంబ సమేతంగా ఆలయానికి రాగా అర్చకులు వారికి పూర్ణకుంభ స్వాగతం పలికారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. శాలువా కప్పి సన్మానించారు. తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా జడ్జి శ్రీదేవి మాట్లాడుతూ పురాతన రామాలయాన్ని దర్శించుకోవడం సంతోషంగా ఉందని తెలిపారు.



కోదండరామాలయంలో జడ్జి దంపతులు



11 రోజులు@ 7,230 ఇళ్లు

ఉమ్మడి జిల్లాలో హౌసింగ్ ప్రణాళిక నత్తనడకన సాగుతోంది. ఈ నెల 20న దీపావళి పండుగ నాటికి 10,821 పక్కాగృహాలను పూర్తి చేయాలనే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నిర్దేశించిన లక్ష్యానికి ఆమడదూరంలో నిలిచే అవకాశం కనిపిస్తోంది. రాష్ట్ర హౌసింగ్ డిపార్ట్‌మెంట్ ఆదేశాల మేరకు కడప, అన్నమయ్య జిల్లా హౌసింగ్ యంత్రాంగాలు దీపావళి పండుగ నాటికి సమయానికి కడపలో 10,821 ఇళ్లు, అన్నమయ్యలో 12,571 పక్కాగృహాలను పూర్తి చేయడానికి అవసరమైన ప్రణాళికను రూపొందించుకుంది. ఉభయ జిల్లాల పరిధిలోని మౌలిక వసతుల కొరత, పెండింగ్ బిల్లుల బకాయి వంటి క్షేత్రస్థాయి పరిస్థితులను మదింపు వేసుకున్న అనంతరం 75 శాతం మేరకు లక్ష్యాన్ని అందుకునే అవకాశాలు అంటకారంగా ఉండడం ఆందోళన కలిగిస్తోంది.

- పేదింట దీపావళి కాంతులు అరకొరే
- రూ.10 కోట్ల బకాయి పెండింగ్
- మౌలిక వసతులతో సతమతం

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లాలో 98,073 పక్కాగృహాలు రిజిస్ట్రేషన్ చేసుకున్నాయి. 2024 జూన్‌లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అధ్యక్షతన నిర్వహించిన హౌసింగ్ అధికారుల సమీక్షా సమావేశంలో కడప జిల్లాలో 10,821, అన్నమయ్య జిల్లాలో 12,571 పక్కాగృహాలను పూర్తి చేయాలనే ఉభయ జిల్లాల హౌసింగ్ యంత్రాంగాలు లక్ష్యాన్ని తీసుకున్నాయి. 2024 జూన్ నుంచి 2025 అక్టోబర్ మొదటి వారానికి కడప జిల్లాలో 7,950 పక్కాగృహాలను మాత్రమే పూర్తి చేసింది. ఈలెక్కన 70.14 శాతానికి పరిమితమైంది. ఈ నెల 20 నాటికి 11 రోజుల వ్యవధి ఉన్న నేపథ్యంలో మరో ఐదు శాతం మేరకు పెరిగి 8,100 పక్కాగృహాలు పూర్తి చేయడానికి అవకాశాలు ఉన్నాయనే ఇంజినీరింగ్ వర్గాలు అంచనా. అన్నమయ్య జిల్లాలో 7,642 పక్కాగృహాల నిర్మాణాలను పూర్తి చేసింది. ఈ లెక్కన 60.79 శాతం మేరకు ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసినట్లు తెలుస్తోంది. ఈ నెల 20న దీపావళి పండుగ నాటికి 11 రోజుల వ్యవధిలో మరో ఐదు శాతాన్ని కలుపుకుని లెక్కిస్తే 7,800 పక్కాగృహాలను పూర్తి చేసే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. దీపావళి పండుగ లక్ష్యంలో భాగంగా కడప జిల్లాలో 3,231 పక్కాగృహాలు, అన్నమయ్య జిల్లాలో 3,999 పక్కాగృహాల నిర్మాణాలను పూర్తి చేయడం అసాధ్యంగా కనిపిస్తోంది.



మౌలిక వసతులలో వెతలు

కడప, అన్నమయ్య జిల్లాలోని పక్కాగృహాల లేఅవుట్లను మౌలిక వసతుల కొరత వేధిస్తోంది. ఈ నేపథ్యంలో పక్కాగృహాల నిర్మాణాలను చేపట్టలేని పరిస్థితి నెలకొంది. జిల్లా హౌసింగ్ యంత్రాంగం ఆయా లేఅవుట్ల వారీగా సమస్యల్ని అధ్యయనం చేయడంపై దృష్టి సారించినప్పటికీ ఫలితం కనిపించడం లేదు. ప్రతి లేఅవుట్‌లోనూ నీటి సరఫరా, రహదారులు, ఎలక్ట్రిఫికేషన్, వస్తువుల అపహరణ వంటి సమస్యల్ని, సదుపాయాల లోపాల్ని గుర్తించింది. ఎలక్ట్రిఫికేషన్ సదుపాయాల కల్పనకు చొరవ తీసుకున్నప్పటికీ లబ్ధిదారులు ముందుకు రాని పరిస్థితి కనిపిస్తోంది.

రూ.10 కోట్ల బకాయి పెండింగ్!

కడప, అన్నమయ్య జిల్లా పరిధిలోని హౌసింగ్ నిర్మాణాలకు బకాయి సమస్య వెంటాడుతోంది. కడప జిల్లాలోనే రూ.10 కోట్ల మేరకు బకాయిలు చెల్లించాల్సిన దుస్థితి దాపురించింది. ఫలితంగా పక్కాగృహాల లబ్ధిదారులకు బిల్లుల చెల్లింపుల భయం వెంటాడుతోంది. రూ.ఎనిమిది కోట్ల మేర నీటి సరఫరా బకాయి పేరుకుని ఉన్నట్లు తెలుస్తోంది. ఏడాది కిందట బకాయి ప్రతిపాదనల్ని ప్రభుత్వానికి నివేదించింది. అయినప్పటికీ స్పందన కొరవడింది. బకాయి చెల్లింపుల ప్రభావం పక్కాగృహాల నిర్మాణ పనులు పడడంతో హౌసింగ్ యంత్రాంగానికి దిక్కుతోచని పరిస్థితి కనిపిస్తోంది.

ప్రయత్నాలు అధిగమిస్తాం.

దీపావళి పండుగ నాటికి నిర్దేశిత లక్ష్యాన్ని అందుకునేందుకు ప్రయత్నం చేస్తాం. జిల్లాలోని 3,231 పక్కా గృహాల నిర్మాణాలను పూర్తి చేయాల్సి ఉంది.

- రాజారత్నం, హౌసింగ్ పీడీ, కడప.

ఆగిన ఆర్‌టిసి అద్దె బస్సులు

డ్రైవర్‌పై ప్రయాణికుడి దాడి

- బస్సులు నిలిపివేసి నిరసన
- ఇబ్బందులు పడిన ప్రయాణికులు
- అధికారుల హామీతో సమ్మె విరమణ
- డ్రైవర్ల సమ్మెపై మంత్రి 'మండిపల్లి' ఆరా

ప్రజాశక్తి-చాపాడు (మైదుకూరు)

మైదుకూరు ఆర్‌టిసి బస్టాండ్‌లో బుధవారం అద్దె బస్సులు నిలిపివేసి డ్రైవర్లు నిరసన తెలిపారు. వివరాల్లోకి వెళితే... మంగళవారం ఆళ్లగడ్డ డిపోకు చెందిన అద్దె బస్సు డ్రైవర్ మహమ్మద్‌ను గుడిపాడు వద్ద కె.హేమవర్ధన్ రాయితో తలపై దాడికి పాల్పడ్డాడు. ఈ దాడికి నిరసనగా బుధవారం కడప, అనంతపురం, కర్నూలు జిల్లాల వ్యాప్తంగా అద్దె బస్సు డ్రైవర్లు నిరసనకు దిగి బస్సులు నిలిపివేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్టేజీ లేకపోయినా ఆపమని అడిగితే డ్రైవర్ ఆపలేదని దాడి చేయడం దారుణమన్నారు. అద్దె బస్సు డ్రైవర్లపై జరిగే దాడుల గురించి డిపో అధికారులు, తమ ఓనర్ల దృష్టికి తీసుకెళ్లినా ఎవరు పట్టించుకోవడం లేదన్నారు. అద్దె బస్సు డ్రైవర్లకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. సమస్యను మైదుకూరు ఆర్‌టిసి డిఎం శ్రీలత, అర్బన్ సిఐ రమణారెడ్డికి తెలిపారు. సిఐ డ్రైవర్లతో మాట్లాడి దాడికి పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రజలకు కూడా వీలైనంతవరకు అవగాహన కల్పిస్తామని తెలిపారు. సిఐ, డిఎం హామీతో డ్రైవర్లు తమ నిరసన విరమించారు. అద్దె బస్సులు నిలిచిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కేవలం ఆర్‌టిసి బస్సులు మాత్రమే తక్కువ సంఖ్యలో అందుబాటులో ఉండడంతో బస్సులు కిక్కిరిసిపోయాయి. మధ్యాహ్నం నుంచి అద్దె బస్సులు కూడా అందుబాటులో ఉండడంతో సమస్య తగ్గినది.

డ్రైవర్ల సమ్మెపై మంత్రి 'మండిపల్లి' ఆరా

కర్నూలు, అనంతపురం, కడప జిల్లాల్లో ఆర్‌టిసి అద్దె బస్సు డ్రైవర్ల సమ్మెపై రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అరా తీశారు. ఆర్‌టిసి అధికారులను వివరణ కోరారు. దువ్వూరులో ఆళ్లగడ్డ డిపో డ్రైవర్‌పై దాడిని తీవ్రంగా ఖండించారు. విధి నిర్వహణలో సిబ్బందిపై



మైదుకూరులో అద్దెబస్సు డ్రైవర్లతో మాట్లాడుతున్న డిపో మేనేజర్, సిఐ



మైదుకూరు డిపోలో ఆగిన అద్దెబస్సులు

దాడులు జరగడం శోచనీయమని తెలిపారు. బస్సు డ్రైవర్ల భద్రతకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులకు మంత్రి ఆదేశాలు జారీ చేశారు. సమన్వయంతో పరిస్థితిని అదుపులోకి తేవాలని సిబ్బందికి సూచించారు. ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా బస్సు సర్వీసులు తిరిగి ప్రారంభించాలని మంత్రి అధికారులకు ఆదేశించారు.

అద్దె బస్సు డ్రైవర్లకు భద్రత కల్పించాలి : సిఐటియు

కడప అర్బన్: అద్దెబస్సు డ్రైవర్లకు ఆర్‌టిసి అధికారులు భద్రత కల్పించాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులురెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం ఆర్ఎం గోపాల్‌రెడ్డి దృష్టికి డ్రైవర్‌పై దాడి ఘటన తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా శ్రీనివాసులురెడ్డి డ్రైవర్లకు భద్రత కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. అద్దెబస్సు డ్రైవర్లను ఆర్‌టిసి డ్రైవర్లుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. మహిళలకు ఉచిత బస్సు పథకాన్ని స్వాగతిస్తున్నామని, అందుకు తగ్గట్లు నూతన బస్సులను ప్రవేశ పెట్టాలని కోరారు. స్పందించిన ఆర్ఎం డ్రైవర్‌పై దాడిని తీవ్రంగా పరిగణిస్తున్నామని, తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సిఐటియు నగర అధ్యక్షులు చంద్రారెడ్డి, డ్రైవర్లు పాల్గొన్నారు.

డ్రైవర్‌పై దాడి దుర్మార్గం : సిపిఎం

ప్రొద్దుటూరు : ఆర్‌టిసి అద్దె బస్సు డ్రైవర్‌పై దాడికి నిరసనగా బుధవారం స్థానిక డిపో వద్ద సిపిఎం నాయకులు ఆందోళన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి సత్యనారాయణ మాట్లాడుతూ ఆళ్లగడ్డ-మైదుకూరు తిరుగుతున్న అద్దె బస్సు డ్రైవర్‌పై ప్రయాణికుడి దాడి చేయడం దుర్మార్గమైన చర్యన్నారు. దాడికి పాల్పడిన వ్యక్తిని వెంటనే అరెస్టు చేసి రిమాండ్‌కు పంపాలన్నారు. మంగళవారం రాత్రి దాడి జరిగితే ఆర్‌టిసి యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరించిందని ఈ కారణంగానే రాష్ట్ర వ్యాప్తంగా అద్దె బస్సు డ్రైవర్లందరూ బస్సులు ఆపి ఆందోళన చేస్తున్నారని తెలిపారు. డ్రైవర్లకు ప్రభుత్వ ఆర్‌టిసి డ్రైవర్లతో పాటు వేతనాలు ఇవ్వాలని, పిఎఫ్, ఇఎస్ఐ కల్పించాలని, బస్సుల్లో ఉచితంగా ప్రయాణం చేసే దానికి డ్రైవర్‌కు ఐడెంటిటీ కార్డు ఇవ్వాలని, ఈ డిమాండ్లపై ఆర్‌టిసి బస్సును రోడ్డుపై ఆపి, అనంతరం డిపో వద్ద ధర్నా చేస్తున్నట్టు తెలిపారు. దాడికి పాల్పడిన వ్యక్తిని అరెస్టు చేసేంతవరకూ ఆందోళన కొనసాగిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో దానియేలు, శివ, శీను, నరేష్, సాల్మను, రాయుడు, డ్రైవర్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలి : జడ్జి

ప్రజాశక్తి - కడప

విద్య ఎంతో విలువైనదని, క్రమశిక్షణతో అభ్యసించాలని సీనియర్ సివిల్ జడ్జి ఎస్.బాబా ఫక్రుద్దీన్ అన్నారు. బుధవారం నగరంలోని ప్రభుత్వ బాలుర వసతి గృహం, ప్రభుత్వ పరిశీలన గృహంను జడ్జి సందర్శించి న్యాయ జ్ఞాన సదస్సు నిర్వహించారు. తొలుత అక్కడి పరిసరాలను, జీవన పరిస్థితులు, భద్రత, భద్రత ఆరోగ్యం, పరిశుభ్రత ఆహారం, మౌలిక సదుపాయాలను పరిశీలించారు. విద్య విలువైనది క్రమశిక్షణతో అభ్యసించాలని సూచించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని పేర్కొన్నారు. పిల్లలకు అందుతున్న భోజన సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. జాతీయ న్యాయ సేవాధికార సంస్థ వారి బాలల సంరక్షణ కొరకు స్నేహపూర్వక న్యాయ సేవలు పథకం 2024 వివరించారు. లీగల్ సర్వీసెస్ హెల్ప్ లైన్ నెంబర్ 15100, చైల్డ్ లైన్ హెల్ప్ లైన్ నెంబర్ 1098, ఉచిత న్యాయ సహాయము మొదలు అంశాలపై అవగాహన కలిగించారు. ఏవైనా సమస్యలుంటే జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ, కడప వారి దృష్టికి తీసుకొని రావచ్చన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ బాలుర వసతి గృహం, ప్రభుత్వ పరిశీలన గృహం సూపరింటెండెంట్, డిస్టిక్ ప్రొబేషన్ ఆఫీసర్, వైద్యాధికారి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చట్టాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలి

చట్టాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని సీనియర్ సివిల్ జడ్జి బాబా ఫక్రుద్దీన్ పోరా లీగల్ వాలంటీర్లకు సూచించారు. జిల్లా కోర్టులోని న్యాయ సేవా సదన్‌లో పోరా లీగల్ వాలంటీర్లకు సెన్సిటైజేషన్ కార్యక్రమం



మాట్లాడుతున్న జడ్జి బాబా ఫక్రుద్దీన్

నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చట్టాల గురించి పూర్తిగా అవగాహన కల్పించారు. లీగల్ సర్వీసెస్ హెల్ప్ లైన్ నెంబర్ 15100, చైల్డ్ లైన్ హెల్ప్‌లైన్ నెంబర్ 1098, దివ్యాంగజన్ హెల్ప్ లైన్ నెంబర్ 14456, ఉచిత న్యాయ సహాయము మొదలగు అంశాలను వివరించారు. ప్రజలకు, న్యాయ సేవల సంస్థల మధ్య మెరుగైన సమన్వయం గురించి పి.ఎల్.విలకి అవగాహన, సంబంధిత విభాగాల సమన్వయంతో ఫిర్యాదుల పరిష్కారం గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పారా లీగల్ వాలంటీర్స్ పాల్గొన్నారు.

'పశు వైద్యులను సస్పెండ్ చేయాలి'

ప్రజాశక్తి- బద్వేలు

మండలంలోని చెన్నకేశంపల్లె, తిరువెంగళపురం పశువైద్య డాక్టర్లు లక్ష్మీనరసయ్య, పవన్ కుమార్ నాలుగు నెలల నుండి పశువైద్యశాలను మధ్యాహ్నానికి మూసివేసి విధులు నిర్వహించకుండా వెళ్తున్న డాక్టర్లు, సిబ్బందిని తక్షణమే సస్పెండ్ చేయాలని డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ముడియం చిన్ని, మాల మహాసేన రాష్ట్ర కార్యదర్శి మీసాల రవి, దళిత నాయకుడు నాగిపోగు నారాయణ డిమాండ్ చేశారు. బుధవారం మధ్యాహ్నం సమయంలో చెన్నకేశంపల్లె పశువైద్య ఆస్పత్రి వద్ద డివైఎఫ్ఐ, దళిత ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ డాక్టర్స్ గతంలో పనిచేసిన పశువైద్యశాలకు సకాలంలో హాజరు కాకుండా, మధ్యాహ్నం ఆసుపత్రి మూసి వేస్తారని, ఉదయం రావడం హాజరు వేసుకోవడం వెళ్లిపోవడం జరుగుతున్నదని, మొక్కుబడిగా మాత్రమే విధులు నిర్వహిస్తున్నారని, ప్రజలు అడిగితే మాకు రాజకీయ అండదండలు అధికారుల అండదండలు వారి సహకారాలు మాకు పుష్కలంగా ఉన్నాయని, ఎవరు నన్ను ప్రశ్నించలేరని చెప్పుకుంటూ ఉంటారని పేర్కొన్నారు. సకాలంలో పశువులకు వైద్యం అందక వందల సంఖ్యలో గొర్రెలు, మేకలు, పశువులు చనిపోయాయన్నారు. టీకాలు మందులు లేవని నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారు. రైతులు పశువులకు వైద్యం అందక బద్వేలు పట్టణానికి వెళ్లి టీకాలు, మందులు తెచ్చుకోవాల్సిన దుస్థితి ఏర్పాడిందని తెలిపారు. జిఒ నెంబర్ 610 ప్రకారం స్థానికులకు పోస్టింగ్స్ ఇవ్వకూడదని ఉందన్నారు. ఈ డాక్టర్లు ఇద్దరూ అధికారాన్ని అడ్డబెట్టుకొని జిల్లా అధికారులకు ముడుపులు చెల్లిస్తూ అక్రమ బదిలీలలో ఇక్కడ వచ్చారని తెలిపారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి చనిపోతే మూగజీవాలకు వారి ద్వారా నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. డాక్టర్లతో పాటు వారి సిబ్బందిని సస్పెండ్ చేయాలని, లేని పక్షంలో జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ బద్వేల్ పట్టణ కార్యదర్శి ఆదిల్, నాయకులు సురేష్, ఖలీల్, బాష, రాజు, పృథ్వీ, సింహాద్రి, కార్తీక్, సుధాకర్ పాల్గొన్నారు.



పశువుల ఆస్పత్రి వద్ద నిరసన తెలుపుతున్న నాయకులు



జిఎస్‌టి నోడల్ అధికారి సుమతిని సన్మానిస్తున్న పఠాన్ షరీఫ్‌ఖాన్

జిఎస్‌టిపై ప్రజలకు అవగాహన కల్పించాలి

- నోడల్ అధికారి గూడూరు సుమతి

ప్రజాశక్తి-కడప అర్బన్ : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జిఎస్‌టి 2.0 స్కీం గురించి ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని నోడల్ అధికారి గూడూరు సుమతి, ఎపి ఆడిటర్స్ అసోసియేషన్ రాష్ట్ర ముఖ్య సలహాదారు పఠాన్ షరీఫ్‌ఖాన్ అన్నారు. కడప ఐఎంఎ హాలులో జిఎస్‌టి పథకంపై అవగాహన సదస్సు జిల్లా టాక్స్ ప్రాక్టీ సనర్స్‌తో కలసి నిర్వహించారు. ఈ సందర్భంగా సుమతి మాట్లాడుతూ ప్రజలలో కొనుగోలు శక్తి పెంచడానికి, ఉత్పాదక రంగాలలో అభివృద్ధిని సాధించడానికి కేంద్ర ప్రభుత్వం 2.0 స్కీం ప్రవేశపెట్టిందని పేర్కొన్నారు. జిఎస్‌టి తగ్గడం వల్ల సామాన్య మానవుడు కూడా తనకు కావల సిన వస్తువులను కొనుగోలు చేసే శక్తి పెరుగుతుందని తెలిపారు. జిఎస్‌టి అసి స్టెంట్ కమిషనర్లు పద్మావతి, రవి కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఈ చట్టం ద్వారా ప్రజలలో వస్తువులు కొనుగోలు పట్ల ఉన్న భయాన్ని తొలగించుకుని కావలసిన వస్తువులను తక్కువ ధరకు కొనుగోలు చేసే శక్తి పెరుగుతుందని తెలిపారు. వస్తువుల ధరలు తక్కువగా ఉంటే ప్రజల కొనుగోలు శక్తి పెరుగుతుందని చెప్పారు. పఠాన్ షరీఫ్‌ఖాన్ మాట్లాడుతూ జిల్లా, రాష్ట్రం, దేశం అభివృద్ధి చెందా లంటే వనరులు అవసరమని చెప్పారు. జిఎస్‌టి, ఐటి రూపంలో ఆదాయం సమకూర్చుకోవాలని పేర్కొన్నారు. కార్యక్ర మంలో జిఎస్‌టి అధికారులు, కడప, అన్నమయ్య జిల్లాల టాక్స్‌ప్రాక్టీషనర్స్ పాల్గొన్నారు.

ఘనంగా 'పుత్తా' జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-చింతకొమ్మదిన్నె: టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని చింతకొమ్మదిన్నె శివాలయం వద్ద కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. పార్టీ నాయకులు గంధం మోహన్ బాబు, టిడిపి మండల అధ్యక్షుడు కృష్ణారెడ్డి, అయ్యవారు ఆధ్వర్యంలో ఘనంగా జన్మదిన వేడుకలు నిర్వహించారు. కమలాపురం నియోజకవర్గంలోని అన్ని వర్గాల ప్రజల కోసం పుత్తా అహర్నిశలు కృషి చేశారని ఈ సందర్భంగా పలువురు టిడిపి నాయకులు కొనియాడారు. ఈ సందర్భంగా బర్త్‌డే కేక్ కట్ చేసి సంబరాలు చేసుకుంటూ శుభాకాంక్షలు తెలియజేశారు. మాజీ ఎమ్మెల్సీ పుత్తా జన్మదినం సందర్భంగా నియోజకవర్గంలోని పలు గ్రామాల నుంచి టిడిపి నేతలు, కార్యకర్తలు, అభిమానులు ఆయన నివాసానికి వెళ్లి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

చెర్లోపల్లి సింగల్ విండో చైర్మన్‌గా 'మాడా'

ప్రజాశక్తి-ఒంటిమిట్ట

మండలంలోని చెర్లోపల్లి సింగల్ విండో సొసైటీకి చైర్మన్‌గా మాడా జయకృష్ణ నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాకు చైర్మన్ పదవిని వచ్చేలా సహకరించిన రాజంపేట జనసేన ఇన్‌ఛార్జి అతిగారి కృష్ణకు ధన్యవాదాలు తెలుపుకుంటున్నానని పేర్కొన్నారు. పార్టీ అధినేత పవన్ కల్యాణ్‌ను అనుసరించి పని చేస్తానని తెలిపారు. చెర్లపల్లి సొసైటీని అన్ని విధాల అభివృద్ధి పథంలో నడిపించేందుకు కూటమ ప్రభుత్వం నాయకులతో కలిసి కృషి చేస్తానని పేర్కొన్నారు మండలంలోని రైతులకు అందరికీ అందుబాటులో ఉండి నా సహాయ సహకారాలు అందించేందుకు ఎల్లవేళలా వారికి తోడ్పడతానని పేర్కొన్నారు.



మాడా జయకృష్ణ

దళితుల ద్రోహి చంద్రబాబు : వైసిపి

ప్రజాశక్తి - కడప: దళితుల ద్రోహి చంద్రబాబు నాయుడని వైసిపి ఎస్‌సి సెల్ రాష్ట్ర అధ్యక్షులు టి.జె.సుధాకర్ బాబు అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సొంత జిల్లాలో అంబేద్కర్ విగ్రహానికి నిప్పు పెడితే ఇంతవరకు చర్యలు లేవన్నారు. పోలీసులు ఎన్ని కేసులు పెట్టినా వైసిపి కార్యకర్తలను భయభ్రాంతులకు గురిచేసినా భయపడే ప్రసక్తే లేదన్నారు. బుధవారం వైసిపి జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసిపి బలోపేతానికి అనేక కీలక సంస్కరణలు తెస్తున్నామన్నారు. ప్రజా సమస్యల పరిష్కా రానికి వైసిపి ఎస్‌సి సెల్ తరపున పోరాటానికి సిద్ధమన్నారు. టిడిపి కూటమి ప్రభుత్వ పాలనలలో ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రయి వేటీకరణ చేయడానికి వైసిపి పూర్తిగా ఖండిస్తుందన్నారు. జగన్మోహన్‌రెడ్డికి ఎక్కడ పేరు వస్తుందని మెడికల్ కళాశాలలను ప్రయివేటీకరణ చేయాలని చూస్తున్నారన్నారు. ఈ నిర్ణయంతో పేద ప్రజలకు న్యాయమైన వైద్య సేవలు అందకుండా కూటమి ప్రభుత్వం కుటిల రాజకీయాలు చేస్తుందన్నారు. చంద్రబాబు అమలు చేస్తున్న నిర్ణయాలను మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యానాయుడు వ్యతిరేకించారని తెలిపారు. చంద్రబాబు అనుచరులకు మెడికల్ కళాశాలలను అందకుండా వైసిపి ఎప్పటికప్పుడు పోరాటాలు చేస్తామని హెచ్చరించారు.



మాట్లాడుతున్న సుధాకర్‌బాబు

భూ సమస్యల ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి

ప్రజాశక్తి - కడప

పెండింగ్ భూ సమస్యల ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి సాధించినట్లు కలెక్టర్ శ్రీధర్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లోని సభాభవన్‌లో ప్రత్యేక ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్)ను నిర్వహించారు. కలెక్టర్ శ్రీధర్, జెసి అదితి సింగ్‌తో కలసి ప్రజాఫిర్యాదులను పునఃపరిశీలన చేశారు. ప్రభుత్వం పిజి ఆర్ఎస్ వ్యవస్థ నిర్వహణపై ప్రత్యేక పర్యవేక్షణ చేస్తోందన్నారు. ప్రభుత్వం అందించే సేవలో రెవెన్యూ సేవలు ప్రధానమైనవి, దీర్ఘకా లికంగా పరిష్కారం కాని భూ సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించామని పేర్కొన్నారు. ప్రతి అర్జీదారులతో వ్యక్తిగతంగా మాట్లాడుతూ రెవెన్యూ కు సంబంధించి గ్రామస్థాయి రికార్డులతో సరిచూసుకొని సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడుతున్నామ న్నారు. జిల్లా నలుమూలల నుండి వచ్చిన అర్జీదారులు వారి వెంట వచ్చిన కుటుంబ సభ్యులకు ఎలాంటి కొరత లేకుండా సీటింగ్, భోజన సదుపాయాలను కల్పించారు. జిల్లాలో ప్రజాఫిర్యాదుల పరిష్కారానికి ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేసి పరిష్కారానికి కలెక్టర్ చేస్తున్న కృషికి అర్జీదారులు సంతోషం వ్యక్తం చేశారు. ప్రజా ఫిర్యాదుల పెండెన్సీ నమోదు శాతం జీరో స్థాయిలోకి వచ్చేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు.కుటుంబ తగాదాల నేపథ్యంలో ఉన్న భూ సమస్యల పరిష్కారానికి తీసుకోవలసిన చర్యలపై అర్జీదారులకు తగు సూచనలు చేశారు. ఈ ప్రత్యేక ఫిర్యాదుల కార్యక్రమంలో డిఆర్ఒ విశ్వేశ్వర నాయుడు, కడప, జమ్మలమడుగు, బద్వేలు, పులివెందుల ఆర్‌డిఒలు జాన్ ఇర్విన్, సాయిశ్రీ, చంద్రమోహన్, చిన్నయ్య, జిల్లా పరిషత్ సిఇఒ ఓబులమ్మ, సర్వే ల్యాండ్స్ ఎడి మురళీ కృష్ణ, అన్ని మండలాల తహశీల్దార్లు, ఆర్ఐలు, సంబందిత అధికారులు పాల్గొన్నారు.

యుజిసి నెట్ అర్హులకు పిహెచ్‌డిలో ప్రవేశాలు

ప్రజాశక్తి-కడప అర్బన్

యూనివర్సిటీ గ్రాంట్ కమిషన్(యుజిసి) నేషనల్ ఎలిజిబిలిటీ టెస్ట్(నెట్) అర్హత సాధించిన వారికి యోగి వేమన విశ్వవిద్యాలయంలో పిహెచ్‌డి ప్రవేశానికి నేరుగా ప్రవేశాలు కల్పిస్తున్నట్లు విశ్వవిద్యాలయ డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్ డాక్టర్ లక్ష్మీ ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. యుజిసి నెట్ ఫెలోషిప్, లెక్చరర్షిప్, పీహెచ్డీ క్వాలిఫై అయిన అభ్యర్థులు yvu.edu.inను సందర్శించి దరఖాస్తును డౌన్‌లోడ్ చేసుకోవాలని పేర్కొన్నారు. పూర్తిచేసిన దరఖాస్తును ఈ నెల 15వ తేదీ లోపు విశ్వవిద్యాలయంలో సమర్పించాలని తెలిపారు. విశ్వవిద్యాలయంలో లభించే ఖాళీలను అనుసరించి ఇంటర్వ్యూలు నిర్వహించి అభ్యర్థులను పీహెచ్డీ సీట్లను ఎంపిక చేస్తామని పేర్కొన్నారు. వివరాలకు 8317532040 నెంబర్‌ను సంప్రదించాలని తెలిపారు.



ఎస్‌సి కమిషనర్ చైర్మన్‌కు మొక్కను అందజేస్తున్న కలెక్టర్ శ్రీధర్

ఎస్‌సి కమిషన్ చైర్మన్‌ను కలిసిన కలెక్టర్

ప్రజాశక్తి-కడప అర్బన్

రాష్ట్ర ఎస్‌సి కమిషన్ చైర్మన్ కె.ఎస్.జవహర్‌ను బుధవారం స్థానిక ఆర్అండ్‌బి గెస్ట్‌హౌస్‌లో కలెక్టర్ శ్రీధర్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అంతకుముందు జిల్లా అధికారులు, స్థానిక నేతలు, నాయకులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. జవహర్‌తో పలువురు ఎంఆర్‌పిఎస్, విహెచ్‌పిఎస్, ఎస్‌సి నాయకులు భేటీ అయ్యారు. అనంతరం ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఆయనను కలిసిన వారిలో కడప ఆర్‌డిఒ జాన్ ఇర్విన్, సోషల్ వెల్ఫేర్ డిడి సరస్వతి, డిఆర్‌డిఎ పీడీ రాజ్యలక్ష్మి, డిఎస్‌పిలు ఉన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

ప్రజాశక్తి-కడప అర్బన్ : కోటిరెడ్డి మహిళా డిగ్రీ కళాశాలలో బోటనీ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో ఎపి బయోడైవర్సిటీ కంట్రోల్ బోర్డ్ సౌజన్యంతో వైల్డ్‌లైఫ్-25 వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వేమల సలీంబాషా అధ్యక్షత వహించి మాట్లాడుతూ బయోడైవర్సిటీ ప్రాధాన్యత గురించి విద్యార్థినులకు వివరించారు. వైవీయూ ప్రొఫెసర్ మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ వైల్డ్‌లైఫ్ 25 వారోత్సవాల ప్రాధాన్యత తెలిపారు. వన్యప్రాణులను నిత్యం ప్రతి ఒక్కరూ సంరక్షించాలని చెప్పారు. డిస్టిక్ బయోడైవర్సిటీ కో-ఆర్డినేటర్ ఎన్.ఖాదరవల్లి మాట్లాడుచూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జీవవైవిద్య సంరక్షణ కోసం చాలా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయని చెప్పారు. విద్యార్థినులకు పోస్టర్ ప్రజెంటేషన్‌ను నిర్వహించి విజేతలకు బహుమతులను ముఖ్య అతిథుల ద్వారా అందించారు. వీటిలో మొదటి బహుమతి తృతీయ సంవత్సరం బోటనీ చదువుతున్న జాహ్నవి, ద్వితీయ బహుమతి ద్వితీయ సంవత్సరం చదువుతున్న స్వీటీ, తృతీయ బహు మతిని మొదటి సంవత్సరం బోటనీ చదువుతున్న నాగమణి అందుకున్నారు. కార్యక్రమంలో ఎకనామిక్స్ లెక్చరర్ గురు మోహన్‌రెడ్డి, పొలిటికల్ సైన్స్ లెక్చరర్ సుబ్బారెడ్డి, బాటనీ లెక్చరర్ అనురాధ, ఎన్ఆర్‌సి కో-ఆర్డినేటర్ రాజమోహన్‌రెడ్డి పాల్గొన్నారు.



రోడ్డుపై ప్రవహిస్తున్న వర్షపు నీరు

పులివెందులలో భారీ వర్షం

- మోకాలిలోతు నీటితో రోడ్లన్నీ జలమయం

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

పులివెందులలో బుధవారం మధ్యాహ్నం 3నుంచి 4గంటల వరక కురిసిన భారీ వర్షానికి రోడ్లు జలమయమయ్యాయి. ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం పడింది. మోకాలిలోతు నీరు రోడ్లపై నిలిచింది. ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగింది. వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రబీ సాగుకు అనువైన సమయం కావడంతో రైతుల్లో హర్షం వ్యక్తమవుతోంది.

14న తలనీలాలు, టెంకాయల వేలం పాట

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని అల్లాడుపల్లె వీరభద్రస్వామి దేవస్థాన ఆధ్వర్యంలో తలనీలాల సేకరణ, టెంకాయలు అమ్మకాలు చేపట్టేందుకు ఈనెల 14న మంగళవారం వేలం పాట నిర్వహిస్తున్నట్లు ఆలయ ఇఒ శంకర్ బాలాజీ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నిబంధనల మేరకు వేలం పాటలో పాల్గొనాలని ఆయన సూచించారు. వేలం పాట ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు, దేవాదాయ శాఖ అధికారుల సమక్షంలో నిర్వహిస్తామని తెలిపారు.

ఎపిజిబి సేవల్లో అంతరాయం

ప్రజాశక్తి - సింహాద్రిపురం

సాంకేతిక కారణాలతో ఎపిజిబి సేవల్లో అంతరాయం ఉంటుందని ఆ బ్యాంక్ మేనేజర్ కృష్ణకిషోర్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ బ్యాంకు ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ నుంచి ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకుగా అవతరించిన తర్వాత సాంకేతిక కారణాల దృష్ట్యా సేవలు నిలిచిపోనున్నాయన్నారు. గురువారం సాయంత్రం 6 గంటల నుంచి సోమవారం ఉదయం 10 గంటల వరకు అన్ని రకాల బ్యాంకు లావాదేవీలు నిలిచి పోనున్నాయన్నారు. ఆఫ్‌లైన్, ఆన్‌లైన్‌తోపాటు డిజిటల్ లావాదేవీలు జరగవని తెలిపారు. ఖాతాదారులు ప్రత్యామ్నాయ ఏర్పాటు చేసుకోవడంతోపాటు తమకు సహకరించాలని ఆయన కోరారు.

12న ఉచిత గుండె చికిత్స వైద్య శిబిరం

ప్రజాశక్తి - వేంపల్లె

స్థానిక పులివెందుల రోడ్డులో ఉన్న దారుల్ ఉలూమ్ రహమానీయ మసీదు ఆవరణలో ఈనెల 12న ఆదివారం ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 4గంటలకు వరకు గుండెకు సంబంధించి ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు మదరాసా ప్రతినిధులు తెలిపారు. ఆక్మిమెండ్ హాస్పిటల్, దారుల్ ఉలూమ్ రహమానీయ మదరాసా ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఉదయం 7నుంచి 10 గంటల వరకు రక్త పరీక్షలు చేస్తారన్నారు. కార్డియాలజీ వైద్యులు ఆయాజ్ అక్బర్, సామా అక్బర్ రోగులను పరీక్షిస్తారన్నారు. బిపి, షుగర్, ఈసిజీ పరీక్షలు కూడా ఉచితంగా చేస్తారని తెలిపారు. మండల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మాజీ సిఎం జగన్ వ్యాఖ్యలు హాస్యాస్పదం

- ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

తన పాలనలో కల్తీ మద్యం లేదని, మెడికల్ కాలేజీల విషయంలో మాజీ సిఎం జగన్ వ్యాఖ్యలు హాస్యాస్పదమని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక నెహ్రూ రోడ్డులోని ఆయన కార్యాలయంలో విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ తన పాలనలో నాసిరకం మద్యం లేదని, ప్రజలకు నాణ్యమైన మద్యం సరఫరా చేశానని తెలుపుతున్న జగన్ గత ప్రభుత్వంలో డిస్టిలరీలోనే కల్తీ మద్యం తయారీ జరిగి షాపులకు కాకుండా ఏకంగా నేతలకు సరఫరా జరిగి భారీగా ధనార్జన చేశారని విమర్శించారు. జగన్ జే బ్రాండ్ కల్తీ మద్యానికి ఎందరో అనారోగ్యం పాలవడం, చాలా మంది మరణించారని గుర్తు చేశారు. మంజూరైన 17 మెడికల్ కాలేజిలలో కనీసం ఒక్కటైనా పూర్తి చేశారా అని ప్రశ్నించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య, మాజీ మున్సిపల్ చైర్మన్ ఆసం రఘురామిరెడ్డి, మాజీ కౌన్సిలర్ తలారి పుల్లయ్య, నాయకులు సిద్దయ్య పాల్గొన్నారు.

ఆర్‌టిసి ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - జమ్మలమడుగు

ఆర్‌టిసి ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ గౌరవాధ్యక్షులు కోరారు. ఆ మేరకు ఎమ్మెల్యే సి.ఆదినారాయణ రెడ్డికి వారు విన్నవించారు. మండల పరిధిలోని దేవగుడి గ్రామంలో బుధవారం ఎమ్మెల్యే, టిడిపి ఇన్‌ఛార్జి భూపేష్‌రెడ్డిని ఎన్‌ఎంయు నాయకులు కలిశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ స్త్రీ శక్తి పథకం అమలు చాలా ఉపయోగకరమైందన్నారు. మహిళా ఆర్థిక స్వాలంబనతోపాటు కుటుంబ ఆర్థిక అభివృద్ధి కలుగుతుందన్నారు. ఈనేపథ్యంలో ఆర్‌టిసి ఉద్యోగస్తులు స్త్రీ శక్తి పథకం వల్ల చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. సమస్యలను సానుకూలంగా విని ఆర్‌టిసి ఉద్యోగస్తుల సమస్యలు తప్పక పరిష్కరిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారన్నారు. కార్యక్రమంలో కడప రీజనల్ కార్యదర్శి పి.సుధాకర్, రీజనల్ చైర్మన్ శేషన్న, డిపో ప్రెసిడెంట్ పి.బ్రహ్మం, డిపో కార్యదర్శి ఎంజిసిఏ రెడ్డి, అడిషనల్ కార్యదర్శి నాగేంద్ర, గ్యారేజీ కార్యదర్శి ఎస్ఎం వలి పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో మహిళ మృతి

ప్రజాశక్తి - చాపాడు

మండల కేంద్రమైన చాపాడులో బుధవారం విద్యుత్ షాక్‌తో మహిళ మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. బంధువులు అందించిన వివరాల ప్రకారం.. అండ్లదుర్తి నూర్జహాన్ (59) వాషింగ్ మిషన్ ప్లగ్ తీస్తుండగా షాక్‌కు గురైంది. కుటుంబ సభ్యులు గమనించి రక్షించే ప్రయత్నం చేపట్టి నప్పటికీ ఉప యోగం లేదు. 108లో ప్రొద్దుటూరు తరలించే ప్రయత్నం చేయగా అప్పటికే మృతి చెందినట్లు 108 సిబ్బంది నిర్ధారించారు. ఆమెకు భర్త, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు.



మృతి చెందిన నూర్జహాన్

క్రైం కార్నర్

బైక్‌ను ఢీకొన్న లారీ : ఇద్దరు మృతి

ప్రజాశక్తి - ముద్దనూరు

కడప-తాడిపత్రి ప్రధాన రహదారి కొత్తపల్లి గ్రామ సమీపంలో మంగళవారం రాత్రి ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. బైక్‌ను లారీ ఢీకొన్న ఘటనలో శెట్టూరి హాజీవల్లి (31), బొమ్మనబోయిన రామ్మోహన్ (36) దుర్మరణం చెందారు. సిఐ దస్తగిరి తెలిపిన వివరాల ప్రకారం.. ఎర్రగుంట్ల మండలం చిలమకూరు గ్రామానికి చెందిన హాజీవల్లి, చింతకొమ్మదిన్నె మండలం సుగాలి బిడికి గ్రామానికి చెందిన రామ్మోహన్ లారీ డ్రైవర్లుగా పని చేస్తున్నారు. ఇద్దరూ కలిసి సొంత పని నిమిత్తం చిలమకూరు నుంచి బైక్‌లో ముద్దనూరుకు వస్తుండగా, కొత్తపల్లి గ్రామం వద్దకు రాగానే తాడిపత్రి వైపు నుంచి వస్తున్న లారీ ఎదురుగా ఢీ కొంది. ఈ ప్రమాదంలో హాజీవల్లి అక్కడికక్కడే మృతి చెందగా, తీవ్రంగా గాయపడిన రామ్మోహన్ 108లో ప్రొద్దుటూరు ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యంలో చనిపోయాడు. హాజీవల్లి తమ్ముడు అబ్బాస్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ దస్తగిరి తెలిపారు.

దోమలు బాబోయ్.. దోమలు

రోగాల బారిన ప్రజలు - నివారణ చర్యల్లో అధికారుల నిర్లక్ష్యం

ప్రజాశక్తి - వేంపల్లె

దోమల మోతతో ప్రజలు అల్లాడుతున్నారు. మండలంలో గత కొద్ది రోజులుగా 'గుయ్యి'మంటూ దోమలు విజృంభిస్తున్నాయి. దోమకాటుకు ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. దోమల నివారణకు చర్యలు చేపట్టాల్సిన అధికారులు, సర్పంచ్‌లు, గ్రామ కార్యదర్శులు నిర్లక్ష్యంగా ఉంటున్నారనే ఆరోపణలున్నాయి. గ్రామాల్లోని ప్రతి వీధిలోనూ అపరిశుభ్రత నెలకొనడంతో దోమలు వృద్ధి చెందుతున్నాయి. ఉదయం, సాయంత్రమనే తేడా లేకుండా ప్రజలపై దాడి చేస్తున్నాయి. మండలంలోని ఆయా గ్రామ పంచాయతీల్లో సరైన డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడంతో ప్రతి వీధిలోనూ నీరు నిల్వ ఉండడం వల్ల దోమలు ఎక్కువయ్యాయని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. అధికారులు తమకేమీ తెలియనట్లు చుట్టపు చూపుగా వచ్చి వెళుతున్నారని మండల వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అపరిశుభ్రత తాండవిస్తోందని ఆందోళన చెందుతున్నారు. వారంలో రెండుసార్లు ప్రతి వీధిలోనూ ఫాగింగ్ చేయాలని కోరుతున్నారు. డ్రెయినేజీలో మురుగునీరు నిల్వ ఉండడంతో దుర్వాసన భరించలేకున్నామని వాపోతున్నారు. గ్రామంలో చెత్తాచెదారం నిల్వ లేకుండా చూడాలని కోరుతున్నారు. డ్రెయినేజీ వ్యవస్థ అంతంతమాత్రంగా ఉండడంతో వీధులు మురుగుమయం అవుతున్నాయని తెలిపారు. దోమల నివారణకు, దుర్వాసన తొలగించేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు కృషి చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



వేంపల్లెలో అపరిశుభ్రంగా ఉన్న వీధి

ఆక్రమణలు తొలగింపు.. డ్రెయినేజీ సమస్య పరిష్కారం



కాలువపై ఆక్రమణలను తొలగిస్తున్న అధికారులు

ప్రజాశక్తి - చాపాడు (మైదుకూరు)

మైదుకూరు మున్సిపాలిటీ బద్వేల్ రోడ్డులో ఎర్రచెరువు నుండి నీరు ప్రవహించే కాలువపై ఆక్రమణలను బుధవారం అధికారులు తొలగించారు. సోమవారం పడిన అధిక వర్షానికి రెండు రోజులపాటు నీరు పూర్తిగా రోడ్ల వెంబడి ప్రవహించడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. సమస్యను వెంటనే పరిష్కరించాలని ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ ఇంజినీరు నిరంజన్‌రెడ్డిని ఆదేశించారు. ఆ మేరకు ఆయన జెసిబి యంత్రం సాయంతో కాలువపై ఏర్పాటు చేసిన అక్రమ కట్టడాలను తొలగించారు. కాలువలో పూడికతీత పనులు చేపట్టారు. కాలువ వెంబడి సిమెంట్ దిమ్మెలు తొలగించారు. కాలువ వెంబడి కడప రోడ్డు వరకు పూర్తిస్థాయిలో కాలువలో పూడికతీత పనులు చేపట్టి సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

సిజెఐపై దాడిని ఖండించండి

- నిరసనలో ప్రజాసంఘాలు

ప్రజాశక్తి - జమ్మలమడుగు

సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి భూషణ్ రామకృష్ణ గవాయిపై రాకేష్ కిషోర్ అనే న్యాయవాది కోర్టులో అందరి సమక్షంలో దాడి చేయడాన్ని ప్రజాస్వామిక వాదులు, మానవతా వాదులు ఖండించాలని ప్రజాసంఘాల నాయకులు కోరారు. జమ్మలమడుగు పాత బస్టాండ్ గాంధీ విగ్రహం వద్ద దాడిని ఖండిస్తూ డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివ కుమార్ అధ్యక్షతన నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ జమ్మలమడుగు ఇన్‌ఛార్జి శివమోహన్‌రెడ్డి, ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు వీరణాల శివనారాయణ, న్యాయవాదులు భూరామాపురం సుబ్బారావు, రామ్మోహన్, హ్యూమన్ రైట్స్ మహిళా చైర్మన్ అన్నపురెడ్డి రాణి, బిషప్ సంతోష్, గండికోట ఛారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ వై.చంద్రశేఖర్‌రెడ్డి, ఎంఆర్‌పిఎస్ నాయకులు మునిస్వామి, నరసింహులు, చెన్నయ్య మాట్లాడారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ పట్టణ అధ్యక్షులు ఎల్లయ్య, పట్టణ ఉపాధ్యక్షులు సుబహాన్, బుడగజంగం నాయకులు నల్లప్ప, ఎస్సీ,ఎస్టీ మానిటరింగ్ కమిటీ మాజీ సభ్యులు మర్రి ప్రకాశం, కాంగ్రెస్ పార్టీ ఎస్సీ,ఎస్టీ సెల్ నాయకులు వెంకటస్వామి, పాస్టర్ ప్రవీణ్, పాస్టర్ దూల డేవిడ్, సురేంద్రబాబు, పాస్టర్ చిట్టిబాబు, పాస్టర్ జైపాల్ పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న ప్రజాసంఘాల నాయకులు

జిల్లా అభివృద్ధిని విస్మరించిన ప్రభుత్వాలు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

అధికారంలో ఉన్న ఎన్‌డిఎ మిత్ర పక్షాలు, వైసిపి ఇరుపక్షాలు కూడా అధికార దాహంతో జిల్లా సమగ్ర అభివృద్ధిని పూర్తిగా విస్మరించాయని సిపిఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ పేర్కొన్నారు. స్థానిక సిపిఎం కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కడప జిల్లా రాజకీయాలలో టిడిపి, వైసిపిలో అంతర్గత కారుమబ్బులు అలుముకొని ఉన్నాయన్నారు. ఈ వైరుధ్యాలను ఇరుపక్షాలు ఎవరికి వారు అనుకూలంగా మలుచుకోవడానికి ప్రయత్నిస్తున్నాయని విమర్శించారు. జిల్లాలో కడప ఉక్కు ఫ్యాక్టరీ నిర్మాణం, పులివెందుల మెడికల్ కళాశాల ప్రారంభం, మేజర్, మైనర్, స్మాల్ లిఫ్ట్ ఇరిగేషన్ పనులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. కడప బెంగళూరు రైల్వేలైన్ అసంపూర్తిగా ఉందన్నారు. స్మార్ట్ మీటర్ల పేరుతో ప్రజలపై అదనపు భారాలు మోపుతున్నాయన్నారు. రైతులకు యూరియా కొరత, బలవంతుల దౌర్జన్యాలు, వలసల నివారణ, బలవంతపు భూసేకరణ వంటి ప్రజా సమస్యలపై భవిష్యత్తులో ప్రజాస్వామ్య ఉద్యమం నిర్వహిస్తామని చంద్రశేఖర్ తెలిపారు. సమావేశంలో సిపిఎం నాయకులు సత్యనారాయణ పాల్గొన్నారు.

ఓట్లను దోచుకోవడాన్ని వ్యతిరేకించాలి

ప్రజాశక్తి - చాపాడు (మైదుకూరు)

కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఓట్ చోర్.. గద్దీ చోడ్ అనే కార్యక్రమంలో భాగంగా బుధవారం వనిపెంట, ఉత్సలవరం గ్రామాల్లో మైదుకూరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి చాపాటి రామ సుధాకర్‌రెడ్డి ప్రజలకు అవగాహన కల్పిస్తూ సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల ఓట్లను బిజెపి దోచుకోవడాన్ని ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలన్నారు. ఇప్పటివరకు నియోజకవర్గంలో విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నామన్నారు. కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం విలువలకు తిలోదకాలిస్తూ ప్రజాస్వామ్యాన్ని అవమానిస్తూ ప్రజల ఓట్లను దోచుకోని గద్దెనెక్కిందని విమర్శించారు. దేశ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఎన్నికల సంఘంలో జరుగుతున్న ఓట్ల చోరీ అంశాన్ని పకడ్బందీ సాక్షాధారాలతో దేశ ప్రజల ముందుంచారన్నారు. కార్యక్రమంలో మైదుకూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వనిపెంట సుదర్శన్‌రెడ్డి, మైనారిటీ నాయకులు రహమాన్, బాషా, ఓబుల్ రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎస్ఆర్ఐటి విద్యార్థులకు ఉద్యోగాలు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

లింగాపురం సమీపంలో ఉన్న ఎస్ఆర్ఐటి ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం బెంగళూరుకు చెందిన కీ లింక్ బిజినెస్ కన్సల్టింగ్ ప్రయివేట్ లిమిటెడ్ డిప్లొమా ఫైనలియర్ విద్యార్థులకు క్యాడ్ డిజైన్ ఇంజినీర్ ఉద్యోగాలకు, బీటెక్ వారికి ఆటో క్యాడ్ డిజైన్ ఇంజినీర్, ఎంబిఎ వారికి హెచ్ఆర్, ఎగ్జిక్యూటివ్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూ నిర్వహించారు. ఆయా విభాగాల్లో 19 మంది ఎంపికయ్యారని ప్రిన్సిపల్ డాక్టర్ పాండు రంగన్ రవి తెలిపారు. ఈ సందర్భంగా వారిని కళాశాల చైర్మన్ బసిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ వీరకుమార్ రెడ్డి, కరస్పాండెంట్ వీరకల్యాణ్ రెడ్డి, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎ.వెంకటేశ్వర రెడ్డి, హెచ్‌ఒడిలు అభినందించారు.

కొత్తపల్లె పంచాయతీ విషయాలు చెబితే వ్యక్తిగత విమర్శలా? : ఎంపిపి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు(పుట్టపర్తి సర్కిల్)

తాను కొత్తపల్లె పంచాయతీ పరిధిలోని మైదుకూరు రోడ్డు సమస్యలు తెలిపితే తనపై కొత్తపల్లె సర్పంచ్ శివచంద్రారెడ్డి వ్యక్తిగత విమర్శలు చేయడం సరైన పద్ధతి కాదని ఎంపిపి శేఖర్ యాదవ్ తెలిపారు. బుధవారం స్థానిక ఎంపిడిఓ కార్యాలయంలోని తన ఛాంబర్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కొత్తపల్లె సర్పంచ్ శివచంద్రారెడ్డికి ఏ విషయంలోనూ పరిపూర్ణ అవగాహన లేదన్నారు. మైదుకూరు రోడ్డులోకి రామేశ్వరం, సోములవారిపల్లె పంచాయితీ నుండి కూడా నీరు వచ్చి చేరుతుందన్నారని, ఇది గతం నుండి జరిగే విషయమే కదా అని తెలిపారు. మత్స్య కాలనీలో సామాన్య కార్యకర్తపైన అతని కుమారుని గెలుపు విషయాన్ని పదేపదే చెబుతున్న శివచంద్రారెడ్డి ఆ గెలుపు రాచమల్లు లేదా బంగారు రెడ్డి కుటుంబ సభ్యులపై కాదని, గెలిచింది వైఎస్ఆర్, జగన్ మోహన్‌రెడ్డిల బొమ్మలతోనే అని గుర్తించాలన్నారు. గతంలో అదే పంచాయతీ వార్డు మెంబర్‌గా ఆయన భార్య పోటీ చేసి డిపాజిట్ కూడా కోల్పోయిన విషయం గుర్తుంచుకోవాలని తెలిపారు. గత సార్వత్రిక ఎన్నికల్లో కూటమి గాలిలో కొత్తపల్లె, కానపల్లె గ్రామాల్లోనే వైసిపికి మెజారిటీ లభించిందని వివరించారు. శివచంద్రారెడ్డి బలాబలాలు రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో తేటతెల్లం అవుతాయన్నారు. తన గురించి సోములవారిపల్లె ప్రజలకు, తమ పార్టీ వారికి తెలిస్తే చాలన్నారు. మైదుకూరు రోడ్డుపై వర్షం వెలిసిన 6 గంటల తర్వాత కూడా నీరు నిలవడమే శివచంద్రారెడ్డి అభివృద్ధి అని విమర్శించారు. ఆయనకు చిత్తశుద్ధి ఉంటే ఆర్‌టిసి బస్టాండ్ ఎదురుగా ఆయనకు సంబంధించిన రూములను మార్కింగ్ వేసిన మేర తొలగించాలన్నారు.



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎపిఒ జయభారతి

ఇకెవైసి త్వరగా పూర్తి చేయాలి

ప్రజాశక్తి - సింహాద్రిపురం

గ్రామీణ ఉపాధి హామీ చట్టం కింద జాబు కార్డులు కలిగి పనులు చేస్తున్న కూలీలు తప్పనిసరిగా ఇకెవైసి చేయించుకోవాలని ఎపిఒ జయ భారతి సూచించారు. బుధవారం మండలంలోని బలపనూరులో జరుగుతున్న ఫేస్ అప్డేట్ ఇకెవైసిని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా జయ భారతి మాట్లాడుతూ ఇకెవైసి చేయించుకొనకపోతే జాబ్ కార్డు రద్దవుతుందన్నారు.



విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేసిన ఎంఇఒ స్టాలిన్, దాతలు

వికలాంగ విద్యార్థులకు దుప్పట్లు, స్వీట్లు పంపిణీ

ప్రజాశక్తి - వేంపల్లె

వేంపల్లె భవిత కేంద్రంలో విద్యాభ్యాసం చేస్తున్న వికలాంగ విద్యార్థులకు దుప్పట్లు, స్వీట్లు, టై పంపిణీ చేశారు. రిటైర్డ్ ఉపాధ్యాయుడు నరసింహారెడ్డి, సుకన్య దంపతుల 40వ పెళ్లి రోజు సందర్భంగా బుధవారం స్థానిక భవిత కేంద్రంలో, మెయిన్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు దుప్పట్లు, స్వీట్లు, టై పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఇఒ-2 స్టాలిన్ ఐజాక్ మాట్లాడుతూ భవిత కేంద్రానికి దాతలు ఇచ్చే సహకారం సంతోషకరమని పేర్కొన్నారు. మెయిన్ ప్రాథమిక పాఠశాలకు హెచ్ఎంగా ఉండి రిటైర్డ్ అయిన నరసింహారెడ్డి పాఠశాలలో చదివే విద్యార్థులకు గతంలో కూడా నోటు పుస్తకాలు, టై, బెల్ట్ ఉచితంగా ఇచ్చారన్నారు. మళ్లీ అదే పాఠశాల విద్యార్థులకు టై ఇవ్వడం అభినందనీయమన్నారు. నరసింహారెడ్డితోపాటు ఆయన సతీమణి సుకన్య అనే ఉపాధ్యాయురాలు కూడా పాఠశాల అభివృద్ధికి సహకరించారన్నారు. విద్యార్థుల మధ్య పెళ్లి రోజు వేడుకలు నిర్వహించుకోవడం చాలా సంతోషంగా ఉందని నరసింహారెడ్డి తెలిపారు. అనంతరం విద్యార్థులు దాతలు ఇచ్చిన వస్తువులను ఎంఇఒ స్టాలిన్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో మెయిన్ పాఠశాల హెచ్ఎం ఆంజనేయులు, ఉపాధ్యాయులు సులోచన, చంద్ర కళావతి, సుకన్య, భవిత కేంద్రం ఐఇఆర్టీలు యశోద, సుజాత, ఆయా సుజాత, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వం, అధికారుల నిర్లక్ష్యమే.. నకిలీ మద్యం తయారీ

ప్రజాశక్తి - వేంపల్లె

రాష్ట్రంలో మద్యం పాలసీ విషయంలో టిడిపి కూటమి, వైసిపి దొందూదొందేనని పిసిసి అధికార ప్రతినిధి డాక్టర్ నర్రెడ్డి తులసిరెడ్డి విమర్శించారు. బుధవారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రెండు ప్రభుత్వాలు కూడా రాష్ట్రాన్ని మద్యాంధ్రప్రదేశ్‌గా చేశాయని తెలిపారు. మండలానికి నాలుగు మద్యం షాపులు, 40 బెల్ట్ షాపులు అనే విధంగా మద్యం పాలసీ తయారైందన్నారు. తాగునీరు దొరకడం లేదుగానీ మద్యం విచ్చల విడిగా ఎక్కడబడితే అక్కడ దొరుకుతోందన్నారు. కూటమి ప్రభుత్వంతో పాటు అధికారులు కూడా నిర్లక్ష్యంగా ఉండడంతో రాష్ట్రంలో నకిలీ మద్యం తయారీ విచ్చల విడిగా కొనసాగుతోందన్నారు. గాంధీ జయంతిన కూడా మద్యం బహిరంగంగా విక్రయాలు చేసినా అధికారులు పట్టించుకోలేదన్నారు. ప్రజల క్షేమం మీద చిత్త శుద్ధి ఉంటే బెల్ట్ షాపులు, నకిలీ మద్యం తయారీని అరికట్టాలని కోరారు. వీలైతే సంపూర్ణ మద్యపాన నిషేధం అమలు చేయాలని తులసిరెడ్డి సూచించారు.



టమోటా రైతులతో మాట్లాడుతున్న ఎన్.తులసిరెడ్డి

టమోటా రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

ప్రజాశక్తి - లింగాల

టమోట రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని పిసిసి అధికార ప్రతినిధి ఎన్.తులసిరెడ్డి కోరారు. గిట్టుబాటు ధర లేక పంటను రోడ్డున పడవేస్తున్నారని తెలిపారు. అంబకపల్లె క్రాస్ వద్ద టమోట గ్రేడింగ్ సెంటర్‌ను బుధవారం ఆయన పరిశీలించారు. ప్రస్తుత ధరల గురించి రైతులను అడిగి తెలుసుకున్నారు. కూటమి ప్రభుత్వం కిలో రూ.20 కొనుగోలు చేయాలన్నారు. పులివెందుల నియోజకవర్గంలో శీతల గిడ్డంగి సెంటర్, ఫ్రూట్ ప్రాసెసింగ్ సెంటర్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అమర్నాథ్‌రెడ్డి, ఉత్తన్న, బండారు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ రంగస్వామి

జిఎస్‌టి తొలగించడంతో తగ్గిన ఆర్థిక భారం

ప్రజాశక్తి మైదుకూరు రూరల్

జిఎస్‌టి తొలగించడం వల్ల విద్యార్థులకు కూడా ఆర్థికభారం తగ్గుతుందని మున్సిపల్ కమిషనర్ వై.రంగస్వామి పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో బుధవారం సూపర్ జిఎస్‌టి-సూపర్ సేవింగ్స్ అనే ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఆయన మాట్లాడుతూ నిరుపేదలకు భారంగా ఉన్న విద్యార్థుల స్టేషనరీపై జిఎస్‌టిని రద్దు చేయడం ఎంతో ఉపయుక్తంగా ఉంటుందన్నారు. విద్యార్థులు, వారి కుటుంబాలకు సంబంధించిన ఆరోగ్య బీమా సేవలపై జిఎస్‌టిని పూర్తిగా తొలగించడం గొప్ప ఉపశమనమని వివరించారు. ప్రిన్సిపల్ డాక్టర్ కెవి సుబ్బారావు, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ విభాగాధిపతి ఎ.శివకుమార్, మున్సిపల్ ఆఫీస్ మేనేజర్ పరమేశ్వర్‌రెడ్డి, అధ్యాపకులు డాక్టర్ జి.హెన్రీ థామస్, పి.చంద్రశేఖర్, ఎస్.సోమన్న నాయక్, ఎస్.స్వర్ణకుమారి, ఎన్.సుభాష్ చంద్రబోస్, ఎం.మహేష్, సి.శివారెడ్డి, ఆర్.స్నేహలత, జి.దినేష్, విద్యార్థులు పాల్గొన్నారు.